దివ్యాంగులకు సబ్సిడీ రుణాలు


బి.శైలజ

చాదర్‌ఘాట్‌: దివ్యాంగులు సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఎండీ బి.శైలజ అన్నారు. దివ్యాంగులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు రూ.350 కోట్లు నిధులు విడుదల చేశామన్నారు. 33 జిల్లాలలోని 711 యూనిట్లకు ఈ నిధులు వర్తిస్తాయని 21 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉండి 40 శాతానికి పైగా వికలాంగత్వం, వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాల్లో రూ. 2.5 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.5 లక్షల ఆదాయం ఉన్నవారు అర్హులన్నారు. ఈ రుణాలు వంద శాతం సబ్సిడీతో వికలాంగుల సంక్షేమశాఖ అందిస్తుందని అర్హులైన వారు వచ్చే నెల 2వ తేదీలోపు రాష్ట్ర వికలాంగుల సంక్షేమశాఖ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ రుణాల మంజూరులో ఉన్నత చదువులు చదువుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక మహోత్సవం


బ్రోచర్‌ ఆవిష్కరిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్‌: ఆర్‌కేపురం డివిజన్‌ టెలిఫోన్‌ కాలనీ రోడ్డు నం–1లో ఉన్న జ్ఞాన సరస్వతి దేవాలయం స్థాపించి పుష్కరకాలం అయిన సందర్భంగా శుక్రవారం నుంచి ఫిబ్రవరి 4 వరకు కుంభాభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చైర్మన్‌ వరప్రసాద్‌, సెక్రటరీ ప్రభాకర్‌ రెడ్డి, ట్రెజరర్‌ రాములు తెలిపారు. మహోత్సవానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం దేవాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కుంభాభిషేక మహోత్సవ వేడుకల్లో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి, ఆనందరావు, లక్ష్మయ్య, దయానంద్‌, రాఘవేంద్రసాయి, రమణయ్య, అరవింద్‌ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

హస్తినాపురం: డివిజన్‌ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని హస్తినాపురం కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను గురువారం కార్పొరేటర్‌ పరిశీలించి మాట్లాడారు. ఆయా కాలనీల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములైతే నాణ్యతతో పాటు సకాలంలో పూర్తవుతాయన్నారు. డివిజన్‌లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కార్పొరేటర్‌ వెంట గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతు చేయాలి

చైతన్యపురి: ఇష్టానుసారంగా రోడ్లను తవ్వి వదిలేయడంతో గుంతలమయంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. గడ్డిఅన్నారం డివిజన్‌ లలితానగర్‌ కాలనీలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. నల్లా కనెక్షన్‌ తీసుకున్న వారు రోడ్లను తవ్వి మరమ్మతు చేయకుండా వదిలేయడంతో గుంతలమయంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఎంపీటీసీ స్థానాలపై ముసాయిదా ప్రచురణ


ముసాయిదా ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శైలజ

మహేశ్వరం: మహేశ్వరం మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు పంచాయతీరాజ్‌ శాఖ కమిషనర్‌ ఆదేశానుసారం ముసాయిదాను గురువారం మండల పరిషత్‌ కార్యాలయంలో ఎంపీడీఓ శైలజ ప్రచురించారు. మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలు మహేశ్వరం–1, మహేశ్వరం–2, మహేశ్వరం–3, సిరిగిరిపురం, తుమ్మలూరు, మన్సాన్‌పల్లి, కొళ్లపడకల్‌, సుభాన్‌పూర్‌, మాణిక్యమ్మగూడ, కల్వకోల్‌, అమీర్‌పేట్‌, గొల్లూరు, నాగారం ఎంపీటీసీ స్థానాలున్నాయి. ఇదివరకు హర్షగూడ ఎంపీటీసీ స్థానం ఉండేది దాని కింద హర్షగూడ, సిరిగిరిపురం, గంగారం గ్రామ పంచాయతీలు ఉండేవి. ఇటీవల హర్షగూడ గ్రామ పంచాయతీ తుక్కుగూడ మున్సిపాలిటీలోకి వెళ్లడంతో సిరిగిరిపురం, గంగారం రెండు గ్రామ పంచాయతీలను కలిసి సిరిగిరిపురం పేరుతో ఎంపీటీసీ స్థానం ఏర్పాటు చేశారు. ముసాయిదా ప్రచురణపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు తెలియజేయాలని కోరారు. ఫిబ్రవరి 3వ తేదీన తుది ప్రచురణ ప్రకటిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

లక్ష్యం..100 శాతం

◆ పది విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ◆ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

మలక్‌పేట అంబర్‌పేట జోన్‌ పరిధిలో 223 మంది విద్యార్థులు


ప్రత్యేక తరగతులకు హాజరైన విద్యార్థులు

చాదర్‌ఘాట్‌: ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణులయ్యేలా విద్యాశాఖ కసరత్తులు చేస్తోంది.
ఇందుకోసం మార్చి నెల 20వ తేదీ వరకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. అన్ని పాఠశాలల్లో తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే ఉదయం సాయంత్రం 2 గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యాశాఖ మలకపేట జోన్‌ పరిధిలోని ఓల్డ్‌మలక్‌పేట అజంపురా డివిజన్లలోని 13 ప్రభుత్వోన్నత పాఠశాలల నుంచి 232 మంది విద్యార్థులను వార్షిక పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు, 2 గంటల పాటు టీచర్లు విద్యాశాఖ అధికారులు అందజేసిన టైంటేబుల్‌ ప్రకారం రోజుకొక పాఠాన్ని బోధిస్తున్నారు.

ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించేలా..

విద్యాశాఖ ఆదేశాల మేరకు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. వార్షిక పరీక్షలకు సన్నద్ధమయ్యేలా పాఠాలు బోధిస్తున్నాం. ప్రతి సబ్జెక్టుపై పూర్తిస్థాయి పట్టు సాధించేలా కృషి చేస్తున్నాం. ప్రశ్నల తీరు జవాబులు రాసే విధానంపై అవగాహన కల్పిస్తున్నాం. వందశాతం ఉత్తీర్ణత సాధిస్తామని ఆశిస్తున్నాం.
– అశ్రఫాతిమా, మలక్‌పేట డిప్యూటీ ఈఓ

ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ..

విద్యలో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు ప్రతిరోజు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు. వారికి పాఠ్యాంశాలు బోధించి ఏ మేరకు నేర్చుకున్నారో తెలుసుకునేందుకు స్లిప్‌ టెస్టులు నిర్వహిస్తున్నారు. అంతే కాకుండా ఆయా సబ్జెక్టుల టీచర్లు విద్యార్థులంతా చదువులో మెరుగయ్యేలా బాధ్యతను తీసుకుంటున్నారు. వంద శాతం లక్ష్యంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టుదలతో శ్రమిస్తున్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

మలక్‌పేట: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గురువారం మలక్‌పేట ఈస్ట్‌జోన్‌ ఆర్టీఓ లెక్కల కిష్టయ్య ఆధ్వర్యంలో హెల్మెట్‌ ధరించాలంటూ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం తాగి వాహనాలు నడపరాదని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. ఆర్టీఓ కార్యాలయం నుంచి మూసారంబాగ్‌ చౌరస్తా అంబేడ్కర్‌ విగ్రహం వరకు కొనసాగిన ర్యాలీలో ఎంవీఐలు రమేష్‌బాబు, బలరామ్‌, రాధిక, నరేంద్రపాల్‌ సింగ్‌, ఏఎంవీఐలు రజిని, అష్రఫ్‌ఖాన్‌, జాన్‌, మధుసూదన్‌రెడ్డి, ఏఓలు ప్రవీణ్‌కుమార్‌, మధుకర్‌, అంజుమ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

సైదాబాద్‌: ప్రభుత్వ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ ఐఎస్‌ సదన్‌ డివిజన్‌ మాజీ అధ్యక్షుడు నాగరిగారి దాస్‌ అన్నారు. గురువారం సింగరేణి కాలనీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సివిల్‌ రైట్స్‌ కార్యక్రమంలో ఆయన పలువురు ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలోని గుడిసెవాసులు, వాంబే గృహ సముదాయాల్లో నివసించే వారిలో అర్హులైన వారంతా రేషన్‌ కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అదే విధంగా సింగరేణి కాలనీలోని సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సైదాబాద్‌ మండల రెవెన్యూ, పోలీస్‌ అధికారులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విశ్రాంత జీవితం ప్రశాంతంగా గడపాలి


పదవీ విమరణ పొందనున్న అధికారికి జ్ఞాపిక అందజేస్తున్న సౌమ్యా మిశ్రా

సైదాబాద్‌: ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ బాధ్యతలు ముగిసిన తర్వాత విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని తెలంగాణ జైళ్లశాఖ డీజీ డాక్టర్‌ సౌమ్యా మిశ్రా సూచించారు. చంచల్‌గూడలోని జైళ్లశాఖ డీజీ కార్యాలయంలోని జైల్‌భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం పదవీ విరమణ పొందుతున్న ఇద్దరు అధికారులను వారి కుటుంబ సభ్యులతో కలిసి సత్కరించారు. 31 ఏళ్ల సర్వీసు ముగించుకున్న కరీంనగర్‌ జిల్లా కారాగారం సూపరింటెండెంట్‌ కె.శ్రీనివాస్‌, 40 సంవత్సరాల సర్వీసు పూర్తయిన హెడ్‌ ఆఫీస్‌లో డిప్యూటీ జైలర్‌ ఎన్‌.సమ్మయ్య శుక్రవారం పదవీ విరమణ పొందనున్నారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు వై.రాజేష్‌, ఎస్‌.మురళీబాబు, డీఐజీలు డాక్టర్‌ శ్రీనివాస్‌, ఎం.సంపత్‌ పాల్గొన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు



దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.28, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్‌ రూ.18, క్యాబేజీ రూ.11, క్యారెట్‌ రూ.19, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.27, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.18, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.45, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.65, బీట్‌రూట్‌ రూ.21, కీర రూ.35, బీన్స్‌ రూ.45, క్యాప్సికమ్‌ రూ.35. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని అఖిలాండేశ్వరీనగర్‌ కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని కాలనీ సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సోమేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా సీబీఎస్‌ రాజు, కోశాధికారిగా కేశేఖర్‌, ఉపాధ్యక్షుడిగా గణేశ్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శిగా శారద, సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు, సలహాదారుడిగా ఏపీఆర్‌ విఠల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సోమేశ్వరరావు మాట్లాడుతూ.. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మాంసం దుకాణాల్లో తనిఖీలు


జరిమానా విధిస్తున్న అధికారులు

మలక్‌పేట: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ పరిధిలోని మాంసం దుకాణాల్లో తనిఖీలు చేపట్టినట్లు సౌత్‌జోన్‌ వెటర్నరీ ఆఫీసర్లు డాక్టర్లు శ్రీకాంత్‌, వసీమ్‌ తెలిపారు. 10 మటన్‌, బీఫ్‌ దుకాణాలు మూయించి వారికి రూ.10,500 జరిమానా విధించామన్నారు. ప్రభుత్వ ఆదేశాలు ఉల్లఘించిన వ్యాపారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముగిసిన స్పోర్ట్స్‌ మీట్‌

చైతన్యపురి: రెండ్రోజుల పాటు జరిగిన భాష్యం పాఠశాల జోనల్‌ ఇంటర్‌ స్పోర్ట్స్‌ మీట్‌ గురువారంతో ముగిసింది. జోన్‌–3లోని పాఠశాల బ్రాంచిల విద్యార్థులకు దిల్‌సుఖ్‌నగర్‌ భాష్యం హైస్కూల్‌ మైదానంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, త్రోబాల్‌, టెన్నిస్‌, షటిల్‌ తదితర పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి సీఈఓ చైతన్య, జోనల్‌ ఇన్‌చార్జి అంకమ్మరావు బహుమతులు అందజేశారు.


కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పనులు పరిశీలన

మీర్‌పేట: కార్పొరేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం మీర్‌పేట మంత్రాల చెరువు, పెద్ద చెరువు వద్ద జరుగుతున్న క్రీడా ప్రాంగణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఈ సందర్భంగా సూచించారు. అంతకుముందు క్యాంపు కార్యాలయం వద్ద నలుగురు దివ్యాంగులకు బ్యాటరీతో నడిచే ట్రైసైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాసులు, స్థానిక నాయకులు తీగల విక్రంరెడ్డి, అర్కల భూపాల్‌రెడ్డి, దీప్‌లాల్‌చౌహాన్‌, దోమలపల్లి రాజ్‌కుమార్‌, దిండు భూపేష్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.

కుష్టు నివారణపై అవగాహన



ప్రతిజ్ఞ చేయిస్తున్న తరుణ్‌

మలక్‌పేట: గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మూసారంబాగ్‌ డివిజన్‌ శాలివాహననగర్‌ యూపీహెచ్‌సీలో హెల్త్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ తరుణ్‌ కుష్టు నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌ఎన్‌ స్వరూపరాణి, స్టాఫ్‌ నర్సు కళావతి, ఫార్మసీ మానస, ఏఎన్‌ఎం రేణుక, ఇందిరా, మధు, అమృత, ఆశ వర్కర్లు అపర్ణ, మంజుల, జ్యోతి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.
◆ శాలివాహననగర్‌ యూపీహెచ్‌సీ వద్ద దిల్‌సుఖ్‌నగర్‌ ఏరియాలో సేవలు అందించే 108 అంబులెన్స్‌ కొత్త వాహనాన్ని అడిషనల్‌ డీఎంహెచ్‌ఓ బ్రిజున్నిసా, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్‌ తరుణ్‌, 108 ప్రోగ్రాం మేనేజర్‌ జాన్‌ షాహిద్‌ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈఎంఈ నవీన్‌, రహీమ్‌, దిల్‌సుఖ్‌నగర్‌ సిబ్బంది రవి, శ్రీనివాస్‌, రాజశేఖర్‌, లతీఫ్‌, మలక్‌పేట ఏరియా సిబ్బంది రమేష్‌, నాగభూషణం పాల్గొన్నారు.

ఆర్చి ప్రారంభం


ఆర్చిని ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌

ఎల్‌బీనగర్‌: బీఎన్‌రెడ్డినగర్‌ డివిజన్‌ పరిధిలోని సౌభాగ్యనగర్‌, మహాలక్ష్మి కాలనీ, బృందావన్‌ మెడోస్‌ కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన కాలనీల ఆర్చిని గురువారం కార్పొరేటర్‌ మొద్దు లచ్చిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అందరూ కలిసి కట్టుగా ఉండి కాలనీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కిరణ్‌కుమార్‌, యాదయ్య గౌడ్‌, నందకిషోర్‌, విష్ణు, మహిళ నాయకురాలు విద్యారెడ్డి, ఆంజనేయులు, మురళి, అనిల్‌ కుమార్‌, వెంకట్‌ రెడ్డి, లక్ష్మణ్‌ యాదవ్‌, సుమన్‌, వెంకటేశ్వర్లు, ఆదిశేషులు, రామకృష్ణ, శేషు, సురేష్‌, శంకర్‌, పోలయ్య, జగన్‌ రెడ్డి, ప్రభాకర్‌ రెడ్డి, రవీందర్‌, రాజు పాల్గొన్నారు.

అనుకున్న లక్ష్యాన్ని పూర్తిచేశా


లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న కాలనీ మహిళలు

బడంగ్‌పేట్‌: తనకు ఇచ్చిన 5 ఏళ్ల కాలంలో అనుకున్న లక్ష్యం కంటే ఎక్కువగానే సాధించానన్న తృప్తి ఉందని, ఆదరించిన డివిజన్‌లోని పలు కాలనీవాసులకు 22వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ లిక్కి మమత ధన్యవాదాలు తెలిపారు. గురువారం డివిజన్‌కు చెందిన శివనారాయణపురం కాలనీకి చెందిన మహిళలు మాజీ కార్పొరేటర్‌ లిక్కి మమత కృష్ణారెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి, స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా వరదలు వచ్చినప్పుడల్లా శివనారాయణపురం, సాయిప్రభహోమ్స్‌, సాయిరాం కాలనీలు వరద ముంపునకు గురై ఆస్తినష్టంతో పాటు అనేక ప్రమాదాలు జరగగా.. తాను కార్పొరేటర్‌గా గెలిచిన వెంటనే నష్టపోయిన 333 కుటుంబాలకు ప్రతీ ఇంటికి పదివేల చొప్పున నష్ట పరిహారం ఇప్పించానన్నారు. వారందరి శాశ్వత పరిష్కారానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోత్సాహంతో ఎస్‌ఎన్‌డీపీ నాలా మంజూరి చేయించి సుమారు రూ.10 కోట్లు వెచ్చించి పనులు పూర్తి చేయించామన్నారు. రూ.7.39 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, వాటర్‌లైన్లు, వీధి దీపాలతో పాటు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. రోజు విడిచి రోజు తాగునీరు వచ్చేలా చర్య లు తీసుకున్నాం. హైటెన్షన్‌ వైర్ల కింద ఉన్న ఇళ్లకు ప్రమాదాలు జరగకుండా బంచ్‌ కేబుల్‌ వేయించామన్నారు. తనను గెలిపించి అండగా ఉన్నా అన్ని కాలనీవాసులకు, మహిళలకు, డివిజన్‌ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధికి సహకారం అందించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మేయర్‌, డిప్యూటీ మేయర్‌, సహచర కార్పొరేటర్లు, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషిచేద్దాం


గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సైదాబాద్‌: జాతిపిత గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేద్దామని హైదరాబాద్‌ జిల్లా వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ కోట్ల శ్రీనివాస్‌ అన్నారు. గురువారం గాంధీ వర్ధంతి పురస్కరించుకొని సైదాబాద్‌లోని గాంధీ విగ్రహానికి ఆయన కాంగ్రెస్‌ నాయకులతో కలిసి నివాళి అర్పించారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

సైదాబాద్‌ రెడ్డిబస్తీలోని గాంధీ విగ్రహానికి బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, నగర కార్యదర్శి ముద్దం శ్రీకాంత్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి నివాళి అర్పించారు.

ఎమ్మెల్యే నివాసంలో..

హస్తినాపురం: అహింసా మార్గంతో పోరాడి స్వాతంత్రం సాధించి, శాంతి, సహనానికి మారుపేరుగా మహాత్మాగాంధీ నిలిచారని ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గాంధీజీ వర్ధంతి పురస్కరించుకుని గురువారం హస్తినాపురం డివిజన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు నారగోని శ్రీనివాస్‌యాదవ్‌ ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి స్వగృహంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు.

చంపాపేటలో..

చంపాపేట: మహాత్మా గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రదేశ్‌ కాంగ్రెస్‌ సేవాదళ్‌ అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌ కోరారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా గురువారం చంపాపేటలోని సేవాదళ్‌ కేంద్ర కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో తెలంగాణ మలిదశ ఉద్యమకారులు రాము ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సింహారెడ్డి, నాగభూషణం, మహ్మద్‌, ఆసీఫ్‌, శివ పాల్గొన్నారు.

వనస్థలిపురంలో..

వనస్థలిపురం: మహాత్మాగాంధీ చూపించిన అహింసా మార్గంలో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు డా.చంటి ముదిరాజ్‌ అన్నారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, వెంకటేశంగౌడ్‌, ప్రియారెడ్డి, మహేష్‌గౌడ్‌, అజయ్‌కుమార్‌, దీపక్‌ కులకర్ణి పాల్గొన్నారు.


గాంధీజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మిద్దెల జితేందర్‌



గాంధీకి నివాళులర్పిస్తున్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి


చంపాపేట గాంధీ విగ్రహ చౌరస్తాలో..


గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


గాంధీ విగ్రహానికి నివాళి అర్పించిన శ్రీనివాస్‌

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9666021515
9912220363
9912220365